క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, గ్రీన్‌ల్యాండ్స్, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు లీలానగర్, విద్యుత్ టవర్, రైల్వే ట్రాక్ ఏరియా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీనివాస టవర్స్, అమోఘ ప్లాజా, మేటాస్, బ్లూ మూన్ హోటల్, మనీల్యాండ్ చైనా, వరుణ్ మోటార్స్, సోనాటా, కట్టమైసమ్మ టెంపుల్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, సూర్యోదయ బిల్డింగ్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో సత్తాచాటాలి



కేక్ కట్ చేస్తున్న బండ కార్తీకరెడ్డి

లాలాపేట: తార్నాక డివిజన్ సాయినగర్ కాలనీలో స్థానిక మహిళా నేతల ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2023 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ఆమె కేక్ కట్ చేశారు. అనంతరం కార్తీకరెడ్డి మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరంలో మహిళలు అన్ని రంగాల్లో సత్తాచాటాలని ఆకాంక్షించారు.

నూతన డీజీపీకి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న తలసాని సాయికిరణ్‌యాదవ్

సనత్‌నగర్: డీజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంజనీకుమార్‌ను సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్ సోమవారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంగళవారం నిర్వహించే అయ్యప్పస్వామి మహా పడి పూజకు హాజరుకావాలని డీజీపీని ఆయన కోరారు.

ఓటరు నమోదు ప్రక్రియపై అభ్యంతరాల స్వీకరణ

ఈనెల 5న తుది జాబితా విడుదల



రాజకీయ నేతలతో సమావేశమైన ముకుందరెడ్డి

సనత్‌నగర్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 5న సనత్‌నగర్ నియోజకవర్గ ఓటరు తుది జాబితాను వెలువరించనున్నారు. ఆ మేరకు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద రెడ్డి సోమవారం పలు రాజకీయ పార్టీ నేతలతో సమావేశమై వారి నుంచి అభ్యంతరాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముకుందరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటివరకు సేకరించిన అభ్యంతరాలు, సూచనలను పరిగణలోనికి తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 5న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

పూర్ణచందర్‌కు డాక్టరేట్



పూర్ణచందర్

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ వాణిజ్యశాస్త్రంలో పూర్ణచందర్‌కు యూనివర్సిటీ పీహెచ్‌డీలో డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ మేరకు ప్రొఫెసర్ జాస్తి రవి కుమార్ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ బిహేవియరల్ ఫ్యాక్టర్స్ ఆన్ ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్ డెసిషన్–ఆన్ ఎంపిరికల్ స్టడీ ఆఫ్ ఇండివిడ్యువల్ ఇన్వెస్టర్స్' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని పూర్ణచందర్ సమర్పించారు. దీంతో యూనివర్సిటీ అధికారులు ఈయనకు డాక్టరేట్‌ను ప్రకటించినట్లు సోమవారం ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. సిద్దిపేటకు చెందిన పూర్ణచందర్ గతంలో సెట్, నెట్ వంటి పరీక్షల్లో అర్హత సాధించడంతో పాటు ప్రతిష్టాత్మక జూనియర్ రీసెర్చ్ ఫెలోగా ఎంపికైనారు. ప్రస్తుతం తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం కోఠిలో పార్ట్‌టైం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.



నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం

ముక్కోటి.. భక్త జన కోటి



పల్లకి సేవలో కోలాటం ఆడుతున్న విద్యార్థినులు

- భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి వేడుకలు
- స్వామివారిని ఉత్తరద్వారం నుంచి దర్శించుకున్న భక్తులు
- ఆలయాల వద్ద ఆధ్యాత్మిక సందడి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె కృషాంక్



స్వామివారిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు, కార్పొరేటర్లు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న అయ్యప్ప స్వాములు

కంటోన్మెంట్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని కంటోన్మెంట్ వ్యాప్తంగా వైష్ణవ ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సోమవారం వేకువజాము నుంచే పలు ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. సికింద్రాబాద్ కోనేరు వీధిలోని వేంకటేశ్వర పెరుమాల్ దేవస్థానం, రెజిమెంటల్ బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర స్వామి దేవస్థానం, బోయిన్‌పల్లిలోని వేంకటేశ్వర దేవస్థానాల వద్ద భారీ సందడి కనిపించింది. వైశాలీ యూత్ ఆధ్వర్యంలో తయారు చేసిన 1500 కిలోల రవ్వ కేసరిని భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఆలయ ఈఓ సత్యమూర్తి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్సారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సకల ఏర్పాట్లు చేశారు.

పలువురి సందర్శన..

- ఎమ్మెల్యే సాయన్న కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె కృషాంక్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాజీ సభ్యులు పాండుయాదవ్, ప్రభాకర్, నళిని కిరణ్ బీఆర్‌ఎస్ నేతలు మధుకర్, నర్సింహ యాదవ్, టింకూగౌడ్, ప్రవీణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నర్సారెడ్డి, తేజ్‌పాల్, నరేశ్, రాయ్ వెంకటేశ్, సురేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో ఉదయం 5 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనానికి అనుమతించారు. స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు భక్తులు పోటెత్తారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు పర్యవేక్షణలో సప్తద్వారాల గుండా ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను ఘనంగా చేశారు. సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులు, అనిల్‌చార్యులు తదితరులు స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, గ్రీన్‌సిటీ అధినేత, బల్కంపేట ఎల్లమ్మ దేవస్థానం బోర్డు సభ్యుడు కొండ్రజు సుబ్బరాజు, మోడల్‌కాలనీ ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం కల్యాణ వేంకటేశ్వరస్వామి

- సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, రవీందర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.కొమ్మాలు అన్ని ఏర్పాట్లను చేశారు.
- రాంగోపాల్‌పేట డివిజన్‌లోని వేంకటేశ్వర పెరుమాళ్ టెంపుల్, వేణుగోపాల్ స్వామి ఆలయాల్లో జరిగిన ముక్కోటి ఏకాదశి పర్వదిన పూజల్లో మాజీ కార్పొరేటర్ కిరణ్మయి కిషోర్ పాల్గొన్నారు. చైర్మన్ నర్సారెడ్డి, మాజీ చైర్మన్ వాసు, ఆంజనేయులు, ప్రవీణ్‌కుమార్, విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

చిలకలగూడలో..

చిలకలగూడ: నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. వేకువజాము 3 గంటలకు వైకుంఠ ఏకాదశి పూజలు, ఉత్తరద్వారం, సర్వదర్శనాలను ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ప్రారంభించారు. ఆకాంక్ష క్యాటరర్స్ అధినేత వేణుమాధవ్ ఆధ్వర్యంలో ప్రసాదం, ప్రత్యేకంగా రూపొందించిన కేలండర్లను పంపిణీ చేశారు. మంత్రి తలసాని, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, ప్రసన్నలక్ష్మీ, సునీత, బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, బండ చంద్రారెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు తలసాని సాయికిరణ్, గుర్రం పవన్‌కుమార్, రామేశ్వరగౌడ్, కిషోర్‌గౌడ్, త్రినేత్రగౌడ్ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

- శ్రీనివాసనగర్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడులకు వైభవంగా నిర్వహించారు. స్వామివారి ముఖచిత్రంతో రూపొందించిన కేలండర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈఓ రాజేష్‌కుమార్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాలాంజనేయస్వామి ఆలయంలో...

- సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్‌ట్రస్టీ నాగులూరి సాయిబాబా నేతృత్వంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఎస్‌ఆర్‌నగర్‌లో..

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. పూజల్లో అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ చైర్మన్ కుమార్‌గౌడ్, ఈఓ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



భక్తులకు కానుకలు అందిస్తున్న ఈఓ రాజేష్‌కుమార్



దర్శనంలో పాల్గొన్న మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ సభ్యులు



బౌద్ధనగర్ రామాలయంలో..

బౌద్ధనగర్‌లో...

బౌద్ధనగర్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని బౌద్ధనగర్‌లోని రామాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భరద్వాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కల్యాణ వెంకన్నస్వామిని దర్శించుకున్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలత



జనరల్ బజార్‌లోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో మర్రి శశిధర్‌రెడ్డి



వేంకటేశ్వర పెరుమాళ్ టెంపుల్‌లో కిరణ్మయి కిషోర్ తదితరులు



ఎస్‌ఆర్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో.. కార్పొరేటర్ సరళ

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్



పద్మారావుగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి సోమవారం తెలంగాణ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి తదితరులున్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జియాగూడలోని రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, వేద పండితులు డిప్యూటీ మేయర్‌ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.

అయ్యప్ప స్వాములకు దుప్పట్ల పంపిణీ



చిలకలగూడ: చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయంలో నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులకు అసోసియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఏటా అయ్యప్ప స్వాములకు దుప్పట్లను అందజేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. నాలుగూరి వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా పలు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. చిలకలగూడ, పార్శీగుట్ట, కిందిబస్తీ, సీతాఫల్‌మండి, వారాసిగూడ, బౌద్ధనగర్, సికింద్రాబాద్, హమాలీబస్తీ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది మాలధారులు పాల్గొని, ఉచితంగా దుప్పట్లు అందించిన నాగులూరి సాయిబాబాకు కృతజ్ఞతలు తెలిపారు.

కేలండర్ల ఆవిష్కరణ



రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏకే జైన్

లాలాపేట: సియోరా రాయల్ కోర్టు సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం 2023 కేలండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం సంస్థ ఆఫీసులో జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ జైపాల్‌రెడ్డి పాల్గొని కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు, వినియోగదారులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ..

అడ్డగుట్ట: దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర కేలండర్‌ను రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఆవిష్కరించారు. సోమవారం దక్షిణ మధ్య రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం రైల్వే జీఎం ఏ.కే. జైన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఇంజినీర్స్ అసోసియేషన్ కేలండర్‌ను ఆవిష్కరింపజేశారు. అనంతరం రైల్వే జీఎంను సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పద్మనాభం, ప్రధాన కార్యదర్శి లోకేశ్వర్, ఫైనాన్స్ సెక్రటరీ రవీందర్, సభ్యులు ఎంఎస్‌ఏ బైగ్, ఐలయ్య, శ్రీధర్, శ్రీనివాస్, శ్రీరాములు, శ్యామ్‌రావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సనత్‌నగర్‌లో మంత్రి తలసాని పర్యటన

సనత్‌నగర్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం సనత్‌నగర్‌లో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు సనత్‌నగర్ బస్టాండ్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకుంటారు. అనంతరం అక్కడి నుంచి జెక్‌కాలనీ సబ్‌స్టేషన్ ప్రాంతంలో పర్యటించనున్నారు.

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టు



సనత్‌నగర్: సర్పంచ్‌ల నిధుల సమస్యలపై రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం ధర్నాచౌక్ వద్ద ధర్నా ప్రకటన నేపథ్యంలో ఆ పార్టీ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ధర్నాచౌక్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన సనత్‌నగర్ కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీనియర్ నాయకులు ఐవన్‌వాజ్, రమేష్, అజ్జూ, కమల్‌రాజ్, తోట మణిమాల, నరేష్ తదితరులను అరెస్టు చేయగా సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మతిస్థిమితం సరిగా లేని మహిళ అదృశ్యం



ఝాన్సీలక్ష్మి

అమీర్‌పేట: మతిస్థిమితం సరిగాలేని మహిళ అదృశ్యమైన ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బోరబండ సాయిబాబానగర్ పోచమ్మ ఆలయ సమీపంలో ఉండే ఝాన్సీలక్ష్మి (49) కొంత కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతుంది. గత నెల 28న ఇంట్లో ఎవరు లేని సమయంలో హ్యాండ్ బ్యాగ్ తీసుకుని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వ్యక్తుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో కూతురు లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మంత్రి తలసానికి శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న అనిల్‌కుమార్

సనత్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు సోమవారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌కుమార్ కూర్మాచలం, పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అధార్ సిన్హా, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఎఫ్‌డీసీ ఈడీ కిషోర్‌బాబు, సెంట్రల్ జోన్ డీసీపీ రాజేష్ చంద్ర, సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్, బేగంపేట, బన్సీలాల్‌పేట కార్పొరేటర్లు మహేశ్వరి శ్రీహరి, హేమలత తదితరులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా రూ.13, నల్ల వంకాయ 28, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 38, పందిరిబీర 40, క్యాబేజీ 10, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 35.

'గాంధీ'లో న్యూఇయర్ సందడి



కేక్ కట్ చేస్తున్న డీఎంఈ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు, వైద్యులు

గాంధీఆస్పత్రి: గాంధీఆస్పత్రి, మెడికల్ కాలేజీల్లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ), గాంధీ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు కేక్ కట్ చేసి వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది తమవంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం గాంధీ యూనిట్ అధ్యక్షుడు రాజేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ శోభన్‌బాబు, వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఆర్‌ఎంఓ–1 జయకృష్ణలతోపాటు పలు విభాగాలకు చెందిన వైద్యులు, ఆర్‌ఎంఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన యువకుడి అరెస్ట్

చిలకలగూడ: ఏటీఎం మెషిన్ పగులగొట్టి చోరీకి యత్నించిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరేష్, డీఐ నాగేశ్వరరావు, డీఎస్సై సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం మెట్టుతండాకు చెందిన జార్పుల భాస్కర్ అలియాస్ చిన్నా (26) నగరానికి వలసవచ్చి చిలకలగూడలో ఎల్‌పీజీ గ్యాస్ ఫిల్లింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. వేతనం చాలకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించేందుకు ఏటీఎంలో చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. డిసెంబరు 31వ తేదీ వేకువజాము 3 గంటల సమయంలో చిలకలగూడ ఎంకే మొబైల్ షాపు పక్కన ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం మెషిన్‌ను ఇనుప రాడ్‌తో పగులగొట్టి డబ్బులు ఉన్న ఐరన్‌బాక్స్‌ను ఓపెన్ చేసేందుకు విఫలయత్నం చేశాడు. ఎస్‌బీఐ సర్వేలెన్స్ కంట్రోల్ రూమ్ సిబ్బంది అలర్ట్ అయి పోలీసులకు సమాచారం అందించారు. గస్తీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా నిందితుడు త్రుటిలో తప్పించుకున్నాడు. ఎస్‌బీఐ ఏటీఎం మేనేజర్ నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా నిందితుడు భాస్కర్‌గా గుర్తించి సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.